క్లుప్తంగా

పనుల్లో నాణ్యత పాటించాలి

డీఈఓ రాధాకిషన్



పరిశీలిస్తున్న డీఈఓ రాధాకిషన్

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని రాజ్‌పేట, శాలిపేట, గాజిరెడ్డిపల్లి పాఠశాలలో జరుగుతున్న పనులను డీఈఓ రాధాకిషన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించి త్వరితగతిన పనులు పూర్తిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, విద్యార్థుల అవసరాలను గుర్తించి వాటిని సమకూర్చేందుకు కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు.

పేద మహిళకు డాక్టర్ సాయం



పత్రాలను అందజేస్తున్న మోహన్‌నాయక్

రామాయంపేట(మెదక్): అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు ఓ గిరిజన డాక్టర్ ఆర్థిక సహాయం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లి వడ్డెర కాలనీకి చెందిన వల్లెపు నర్సింహులు ఇటీవల మృతి చెందగా ఆయన భార్య కొమురమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. పిల్లలను పోషించుకోలేని దుస్థితిలో ఉన్న ఆమెకు నిజాంపేట మండలానికి చెందిన గిరిజన డాక్టర్ మోహన్‌నాయక్ ఆమె కూతురు పేరిట రూ.10వేలు డిపాజిట్‌చేసి ఆ పత్రాలను గురువారం అందజేశారు. మాజీ సర్పంచ్ గేమ్ సింగ్, పలు తండాల నాయకులు రవి, సామ్య నాయక్, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

ఆడపిల్లపై నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

పెద్దశంకరంపేట(మెదక్): ప్రతీ ఆడపిల్లను తల్లిదండ్రులు తప్పకుండా చదివించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీశైల, నాగమణి, పుష్పలత, కృష్ణవేణి పిలుపునిచ్చారు. గురువారం పూసలగల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బేటీబచావో–బేటీపడావో కార్యక్రమంలో భాగంగా వారు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆడ పిల్లలను నిర్లక్ష్యం చేయకుండా అన్నిరంగాలలో ముందుకు వెళ్లేలా చూడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సరళ, రుక్సానాబేగం, సుక్కమ్మ, విజయలక్ష్మి, స్వరూప తదితరులున్నారు.

చట్టాల అమలుకు కృషి



జెండా ఆవిష్కరిస్తున్న కార్మికులు

నర్సాపూర్: కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు అన్నారు. యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం వద్ద కార్మికులు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల రక్షణ కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్మికులు పుష్ప, రాములు, ఆంజనేయులు, శ్రీనివాస్, శేఖర్, లింగం, దాసు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వివక్షకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి

నిజాంపేట(మెదక్): హరిజనవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో అంటరానితనం కులవివక్ష, హోటల్‌లో రెండు గ్లాసుల పద్ధతి, ఆలయాల ప్రవేశంలో ఆటంకాలు లాంటి సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఏ సమస్యలు ఎదురైనా తమదృష్టికి తీసకువస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆర్‌ఐ గంగాధర్ గౌడ్, కార్యదర్శి నర్సింహులు, బాబు, రమేశ్ పాల్గొన్నారు.

ఆదుకుంటున్న ఆమ్‌చూర్

వేసవి వచ్చిందంటే పలుమండలాల్లో చిన్నా, పెద్దా ఆమ్‌చూర్ తయారీలో నిమగ్నమవుతారు. ఏప్రిల్, నుండి జూన్ వరకు వారికి చేతినిండా పని ఉంటుంది. విదేశీ మార్కెట్లో ఈ ఆమ్‌చూర్‌కు మంచి డిమాండ్ ఉండడంతో వ్యాపారులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

– మెదక్‌జోన్

- సీజన్‌లో చేతినిండా పని
- విదేశీ మార్కెట్లో మంచి డిమాండ్
- క్వింటాల్‌కు రూ.35వేల వరకు ఆదాయం



ఆమ్‌చూర్ తయారీలో నిమగ్నమైన గ్రామస్తులు

జిల్లా వ్యాప్తంగా 2,600ఎకరాలలో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. మార్చిలో కురిసిన అకాల వర్షాలకు సుమారు 150ఎకరాలలో మామిడి కాయలు రాలిపోయినా మిగతా అంతా బాగానే ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. చేతికి అందిన మామిడి పంటను రెండు రకాలుగా విక్రయిస్తుంటారు. పండ్లు మగ్గబెట్టి అమ్మడం, మామిడి కాయ లను తెంపి ఆమ్‌చూర్ తయారుచేసి అమ్మడం.

తయారీలో నిమగ్నం..

జిల్లాలోని మెదక్, హవేళిఘణాపూర్, వెల్దుర్తి, కొల్చారం, చేగుంట తదితర మండలాల్లోని చాలా ఊళ్లలో ఆమ్‌చూర్ తయారీ అధికంగా ఉంటుంది. గంపగుత్తగా తోటలు కొనుగోలు చేసిన వ్యాపారులు మామిడి కాయలకు తెంపి కూలీలతో ఆమ్‌చూర్ తయారు చేయిస్తుంటారు. ఒక్కో కూలీ నిత్యం రూ.600ల నుండి రూ.800 వరకు సంపాదిస్తారు. కాయపై పొట్టును తొలగించి రెండు, మూడు రోజులపాటు బండలపై ఆరబెడతారు. మామిడి పీచును సైతం వ్యాపారులు కొనుగోలు చేస్తారు. పలు రాష్ట్రాల్లో అంటుమామిడికి ఈ పీచును కొనుగోలు చేస్తునట్లు వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు సైతం ఈ ఆమ్‌చూర్ తయారీలో నిమగ్నమయ్యారు.

నాణ్యతను బట్టి ధర

ఆమ్‌చూర్ మార్కెట్ నిజమాబాద్, హైదరాబాద్‌లో మాత్రమే ఉంది. మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు ఎక్కువగా ఆమ్‌చూర్‌ను కొనుగోలు చేస్తారు. నాణ్యతను బట్టి క్వింటాల్‌కు రూ.18వేల నుండి రూ.35వేల ధర పలుకుతున్నట్టు తయారీదారులు చెబుతున్నారు.

విదేశాల్లో మంచి డిమాండ్

కొనుగోలుచేసే వ్యాపారులు ఆమ్‌చూర్‌ను పౌడర్ గాచేసి పావుకిలో, కిలో ప్యాకెట్లుగా తయారు చేస్తారు. ఇతర రాష్ట్రాల్లో చింతపండుకు బదులుగా వంటల్లో ఈ పౌడర్‌ను వాడతారు. స్టార్‌హోటల్లో సైతం వాడడం విశేషం. విదేశాల్లోకూడా మంచి డిమాండ్ ఉంది.

మంచి ఆదాయం



20 ఏళ్లుగా మామిడి చెట్లను గుత్తకు తీసుకొని కూలీలతో ఆమ్‌చూర్ తయారు చేపిస్తున్నాను. వేసవిలో మూడు నెలలపాటు కూలీలకు పనిదొరకడంతో పాటు నాకు కూడా మంచి ఆదాయం వస్తోంది. సీజన్‌లో రూ.50వేల వరకు సంపాదిస్తాను.

– చిత్తారి, ఆమ్‌చూర్ తయారీదారుడు, గంగాపూర్

ఐదేళ్ల పాలన సంతృప్తినిచ్చింది

- ఎంపీపీ యమునారెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ యమున

హవేళిఘణాపూర్(మెదక్): ఐదేళ్ల పాలనలో పేదలకు చేసినసేవ తనకు ఎంతో సంతృప్తి కలిగించిందని ఎంపీపీ యమునారెడ్డి అన్నారు. గురువారం మెదక్ మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కోంటూర్ నుంచి మక్తభూపతిపూర్ వరకు ఉన్న రోడ్డు ప్రమాదకరంగా ఉందని, రోడ్డుకు పక్కల మట్టిపోసి ప్రమాదాలు జరుగకుండా చూడాలని కోరారు. మాచవరం గ్రామంలో విద్యుత్‌వైర్లు మరమ్మతుల కోసం ఎల్‌సీ అడిగితే ఇవ్వడంలేదని మాచవరం సొసైటీ చైర్మన్ సీతారామయ్య అడుగగా అందుకు ట్రాన్స్‌కో ఏఈ తిరుపతి సమాధానమిస్తూ ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎల్‌సీ ఇవ్వకూడదన్న ఆదేశాలున్నందున పగటి వేళల్లో ఎల్‌సీలు అడగకూడదని, అత్యవసరంమైతే ఉదయంపూట చేసుకోవచ్చని సూచించారు. అనంతరం ఎంపీపీ యమునారెడ్డి మాట్లాడుతూ ఎల్లప్పుడూ ప్రజల శ్రేయస్సు కోసం పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పీఏసీఎస్ చైర్మన్ సీతారామయ్య, వైస్ ఎంపీపీ ఆంజనేయులు, ఎంపీడీఓ రఘు, ఎంపీటీసీలు రాములు, సిద్దాగౌడ్, అధికారులు శ్రీహరి తదితరులు ఉన్నారు.

దాతల సేవలు వెలకట్టలేనివి



వైకుంఠ రథాన్ని ప్రారంభిస్తున్న సునీతారెడ్డి

- ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజల అవసరాల కోసం కృషిచేస్తున్న దాతల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా తన నాయనమ్మ, తాత పబ్బ రావమ్మ అంజయ్యల జ్ఞాపకార్థం రూ.3లక్షలతో సమకూర్చిన వైకుంఠ రథాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల కష్ట సుఖాల్లో భాగస్వాములైన వారే నిజమైన ప్రజా ప్రతినిధులన్నారు. ఆలయ నిర్మాణాలు, ప్రజల కోసం మహేశ్‌గుప్తా చేస్తున్న సేవలను ఆమె అభినందించారు. దాతలు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. దాతల సహాయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, చంద్రగౌడ్, లాయక్, వెంకటేశ్, దుర్గేశ్, రాములుగౌడ్, నాగేశ్వరరావు, జగన్‌రెడ్డి, రాంచంద్రంగౌడ్, మహేందర్ రెడ్డి, అశోక్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ఫిర్యాదు చేస్తే వెంటనే రంగంలోకి..



కూలీలకు అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ సభ్యులు

- బాధిత మహిళలకు అండగా ఉంటాం
- షీ టీమ్ సభ్యులు

హవేళిఘణాపూర్(మెదక్): జిల్లా షీ టీమ్స్ సభ్యులు మహిళలకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలలో భాగంగా గురువారం మెదక్ మండలంలోని గుట్టకిందపల్లె గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిర్యాదును అందుకున్న వెంటనే బాధిత మహిళలకు అండగా నిలుస్తామన్నారు. పోకిరీలు అసభ్యంగా ప్రవర్తించినా, మాట్లాడినా, వాళ్లతో ఫొటోలుదిగి మోసం చేసినా, పాత ఫొటోలను మార్ఫింగ్‌చేసి బెదిరించినా, బ్లాక్ మెయిల్ చేసి ఇబ్బందులకు గురిచేసినా వెంటనే షీ టీమ్స్ నెంబర్ 87126 57963కు ఫిర్యాదు చేయాలని సూచించారు. పేరు వివరాలు గోప్యంగా ఉంచుతారని చెప్పారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, డయల్ 100కు కాల్ చేయాలన్నారు. ఈవ్–టీజింగ్, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలు, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, మహిళా రక్షణ లాంటి విషయాలపై అవగాహన కల్పించారు. చిన్నారులతో ఎవరైనా తమ ప్రాంతాల్లో పనిచేస్తున్నట్లు తెలిస్తే 1098కి సమాచారం అందించాలని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే 87126 57963 నంబరుకు ఫోన్‌చేసి కాని, వాట్సాప్ ద్వారా మెసేజ్ చేసి కాని ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

శివ్వంపేట(నర్సాపూర్): తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన మండల పరిధి కొత్తపేట గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మన్నే రవి ఇంటికి తాళం వేసి ఊరెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటితాళం పగలగొట్టి లోనికి చొరబడి అల్మారాలోని నగదు పలువస్తువులను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. చోరీ ప్రదేశాన్ని క్లూస్ టీం సిబ్బంది, పోలీసులు పరిశీలించి ఆధారాలు సేకరించారు.

కాళ్లకల్‌లో..

మనోహరాబాద్(తూప్రాన్): ఇంటితాళం పగలగొట్టి చోరీ చేసిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చేసుకుంది. స్థానికులు, ఇంటి యజమానులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన తుమ్మల మల్లేశ్ ఇంటికి తాళంవేసి తన కుటుంబంతో మేడమీద నిద్రిస్తున్నాడు. గుర్తు తెలియని దుండగులు అర్ధరాత్రి తాళం పగులగొట్టి ఇంటిలోని అల్మారాలో ఉంచిన ఆరు తులాల బంగారునగలు, కొంత నగదును అపహరించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్లూస్ టీం సహాయంతో వివరాలు సేకరించినట్లు స్థానికులు తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- సీఐ వెంకటేశ్



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్

రామాయంపేట(మెదక్): నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక సీఐ వెంకటేశ్ హెచ్చరించారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో ఫర్టిలైజర్ వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విత్తన చట్టాలకు లోబడి వ్యాపారం చేసుకోవాలని, రైతులను మోసం చేయవద్దని వ్యాపారులకు సూచించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులకు విధిగా రశీదు ఇవ్వాలని, ప్రతి వ్యాపారస్థుడు తప్పనిసరిగా స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలని చెప్పారు. జిల్లా వ్యవసాయ కార్యాలయం నుంచి లైసెన్సు పొందినవారు మాత్రమే వ్యాపారం నిర్వహించాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రంజిత్, మండల వ్యవసాయాధికారి రాజ్ నారాయణ, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది అసమర్థ పాలన

- బీఆర్‌ఎస్ నేత సత్యనారాయణగౌడ్



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

తూప్రాన్: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని అసమర్థ కాంగ్రెస్ పాలన రాష్ట్రంలో కొనసాగుతోందని బీఆర్‌ఎస్ నేత సత్యనారాయణగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో అన్నివర్గాలకు సుస్థిరపాలన అందించారన్నారు. ఈ కాంగ్రెస్ పాలనలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. రైతులకు విద్యుత్ సరఫరా సక్రమంగా అందడంలేదని, విత్తనాలు, ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చిరొట్ట విత్తనాలు కూడా అందించలేక పోతున్నారని, రైతులపై కాంగ్రెస్‌కు ఏమాత్రం చిత్తశుద్ధిలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ పాలనలోనే వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని చెప్పారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలు బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 2న ప్రతి పంచాయతీలోను బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో సీనియర్ నాయకుడు కిష్టారెడ్డి, యావపూర్ సర్పంచ్ నర్సింహారెడ్డి, హైమాద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మాణిక్‌ప్రభు జాతర



బండ్ల ఊరేగింపులో భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని మక్తలక్ష్మాపూర్‌లో శ్రీమాణిక్‌ప్రభు ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం సాయంత్రం ఎడ్లబండ్ల ఊరేగింపు ఉత్సాహంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను అందజేశారు.

ఎమ్మెల్యే సునీత పూజలు

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని ముచ్చర్ల గ్రామ శివారులోని నల్ల పోచమ్మకు ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నల్ల పోచమ్మ దయతో అందరూ సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు చెప్పారు. ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహులు, ఎంపీటీసీ కిషన్‌రావు, నాయకులు శివశంకర్, యాదగిరి, నరేందర్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజురెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ సైతం అమ్మకు పూజలు చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణ, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

జీలుగ కోసం రైతుల పడిగాపులు



విత్తనాల కోసం వేచిఉన్న రైతులు

కౌడిపల్లి(నర్సాపూర్): జీలుగ విత్తనాల కోసం రైతులు పడిగాపులు పడ్డారు. గురువారం నాగ్సాన్‌పల్లి ఎరువుల దుకాణంనికి వచ్చిన 150బస్తాల జీలుగ విత్తనాల పంపిణీకి కౌడిపల్లిలోని రైతువేదిక వద్ద ఉదయం టోకెన్లు ఇస్తామని వ్యవసాయ అధికారులు చెప్పడంతో పలువురు రైతులు అక్కడికి చేరుకుని పడిగాపులు పడ్డారు. ఏఈఓ దివ్యశ్రీ అప్పటికే టోకెన్లు ఇచ్చి వెళ్లారని చెప్పడంతో రైతులు వెనుదిరిగారు. రైతులకు సరిపడా జీలుగ విత్తనాలు పంపిణీ చేయాలని రైతులు కోరారు.

విత్తనాల పంపిణీ..

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు గురువారం ఇన్‌చార్జి ఏఓ రాజేశ్‌కుమార్ జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. స్థానిక రైతువేదికలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులకు విత్తనాల కొనుగోలు, విత్తన శుద్ధి, రసాయనిక ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. రైతులకు సబ్సిడీపై 30కిలోల బస్తాను రూ.1,116కు అందజేస్తున్నామని, ఇప్పటి వరకు 54క్వింటాళ్ల 30కిలోలను అందజేశామని చెప్పారు. త్వరలో మరిన్ని విత్తనాలు పంపిణీ చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈఓలు స్వాతి, మమత, సుభాష్, పీఏసీఎస్ సీఈఓ రవీందర్ తదితరులున్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు



చిన్నశంకరంపేట(మెదక్): తనిఖీ చేస్తున్న తహసీల్దార్ మన్నన్

- తహసీల్దార్ మన్నన్

చిన్నశంకరంపేట(మెదక్): స్థానిక ఆగ్రోస్ రైతుసేవా కేంద్రాన్ని గురువారం తహసీల్దార్ మన్నన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆగ్రోస్‌సేవా కేంద్రంలో విత్తనాలు, జీలుగ, పెద్ద జనుము నిలువలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని నిర్వాహకుడు పవీణ్‌కు సూచించారు. ఆయన వెంట ఆర్‌ఐ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందజేయాలి

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లిలోని ఎరువుల దుకాణాన్ని ఏడీఏ పుణ్యవతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, ఎరువులు, విత్తనాల స్టాక్, ధరల పట్టికను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డీలర్లు రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను అందజేయాలన్నారు. కల్తీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రశీదు తప్పనిసరి

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రమైన హవేళిఘణాపూర్ ఫర్టిలైజర్ దుకాణాలను ఏఓ నాగమాధురి, ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్ తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రైతులు రశీదు తప్పనిసరిగా తీసుకొని దానిని భద్రపర్చాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లయితే దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిబంధనలు పాటించాలి..

చేగుంట(తూప్రాన్): చేగుంటలోని విత్తనాల దుకాణాలను పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు గురువారం తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో ఉన్న స్టాకు, రిజిస్టర్లు, విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. నిబంధనల ప్రకారమే అమ్మకాలు జరపాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బాలరాజు, వ్యవసాయ అధికారి హరిప్రసాద్, ఆయాశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌లైన్ తొలగింపుపై ఫిర్యాదు



తొలగించిన విద్యుత్ స్తంభం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి కొంతన్‌పల్లిలో వ్యవసాయ బోరుబావుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలను వెంచర్ నిర్వాహకులు తొలగించారని బాధిత రైతులు గురువారం విద్యుత్ ఏఈ దుర్గప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రియల్ వ్యాపారులు వ్యవసాయ భూముల్లో వెంచర్ వేస్తున్నారని, విద్యుత్ స్తంభాలు, వైర్లు అడ్డుగా ఉండడంతో వాటిని తొలగించారని వాపోయారు. విద్యుత్ లైన్ తొలగించడంతో బోరుబావులకు కరెంటు లేక సాగుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంచర్ నిర్వహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ ఏఈ దుర్గప్రసాద్‌ను వివరణ కోరగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

నర్సింగ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి



ఎన్నికైన కమిటీ సభ్యులతో మరియమ్మ

నర్సాపూర్: ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న నర్సింగ్ ఉద్యోగుల సంక్షేమం కోసం తమ అసోసియేషన్ పనిచేస్తోందని తెలంగాణ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియమ్మ తెలిపారు. గురువారం ఆమె ప్రభుత్వ ఆసుపత్రిలో స్థానిక నర్సులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి నర్సెస్ కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షురాలుగా సుబ్బలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా సత్యశ్రీ, కోశాధికారిగా జ్యోతి, వైస్ ప్రెసిడెంట్‌గా సువర్ణ, జాయింట్ సెక్రటరీగా ధనలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విజయలక్ష్మి ఎన్నికయ్యారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.